01 . 09. 2025
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 94 , పేజీలు : 12 వెల:రూ.5/-
SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper

## సిరిసిల్ల వరద బాధితులకు రూ.10 లక్షల సాయం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటన
- ఆ సాయాన్ని సిరిసిల్ల కలెక్టర్ కు అందజేయనున్న బండి సంజయ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు ఎంపీ లాడ్స్ నిధుల కేటాయించనున్న కేంద్ర మంత్రి



కరీంనగర్ వెలుతురు ఆగస్టు 31: అకాల వర్షాలు, వరదలతో నష్టపోయిన జిల్లాల ప్రజలను

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సవరణ బిల్లులకు
# తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదం
- అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్ర వాగ్వాదం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ చట్టాలే అడ్డంకిగా మారాయన్న సీఎం రేవంత్
- కాంగ్రెస్ చిత్తశుద్ధిని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు
- రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న మార్చి నాటి బిల్లుల ప్రస్తావన
- రాబోయే ఎన్నికల్లో 42% కోటా అమలు చేస్తామని ప్రభుత్వ హామీ





హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31: తెలంగాణ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 42 శాతం రిజర్వేషన్లు కల్పించే కీలక సవరణ బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ ఆదివారం ఆమోదం తెలిపింది. తీవ్ర వాదోపవాదాల నడుమ తెలంగాణ మున్సిపాలిటీల (మూడవ సవరణ) బిల్లు-2025, తెలంగాణ పంచాయతీరాజ్ (మూడవ సవరణ) బిల్లు-2025లను సభ వాయిస్ ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. అసెంబ్లీ సమావేశాల రెండో రోజున ప్రభుత్వం ఈ రెండు బిల్లులను సభ ముందుకు తెచ్చింది. స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం కోటా కల్పించడమే ఈ బిల్లుల ముఖ్య ఉద్దేశం. చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆరోపించారు.



## బీసీ బిల్లును వ్యతిరేకిస్తే
# రాజకీయ సమాధి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య**

'బిసిల యుద్ధభేరి' సభలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, తదితరులు

బషీర్ బాగ్ వెలుతురు ఆగస్టు 31: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు సాధించిన స్ఫూర్తితోనే చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇదే చివరి పోరాటమని, బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీసుకువచ్చిన బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే సహించేది లేదని, రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన ఆదివారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్ లో జరిగిన

## ఇక మనం పోటీదారులం కాదు, భాగస్వాములం... ఎస్‌సీవో వేదికగా స్పష్టం చేసిన మోదీ, జిన్‌పింగ్

- ఎస్‌సీవో సదస్సు వేదికగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ
- విభేదాలు వివాదాలుగా మారకూడదని ఇరు దేశాధినేతలు ఏకాభిప్రాయం
- సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం కొనసాగించాలని నిర్ణయం
- ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంచేందుకు అంగీకారం
- ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై ఫలప్రదమైన చర్చలు
- 2026 బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్‌ను ఆహ్వానించిన ప్రధాని మోదీ



హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31: భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు




## ఎమ్మెల్యేగా పోటీకి 21 ఏళ్లు చాలు..
# రాజ్యాంగం సవరించాలి

- కేరళలో ఎంపీ మెరిట్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని యువతకు పిలుపు
- బీజేపీ యువత హక్కులను కాలరాస్తోందని తీవ్ర విమర్శలు
- ఎమ్మెల్యేగా పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్
- ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి
- తెలంగాణలో విద్య, ఆర్థిక రంగాల అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన సీఎం



అలప్పుజ వెలుతురు ఆగస్టు 31: దేశంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2029లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు యువత సంకల్పం తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం కేరళలోని అలప్పుజలో కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నిర్వహించిన 'ఎంపీ



- మామ చెప్పారు, అల్లుడు చేశారు
- శాసనసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

## గూగుల్ మ్యాప్ ను ముందు పెట్టకుని
# కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31: గూగుల్ మ్యాప్ ను ముందు పెట్టకుని కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన చేశారని, హరీష్ రావు సీకెంట్ ఫైల్ కు కింగ్ పిన్ అని, సీకెంట్ ఫైల్, గూగుల్ మ్యాప్ తో లక్ష కోట్లు గోదావరిలో కొట్టుకుపోయాయనీ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. అసెంబ్లీలో పొంగులేటి మాట్లాడిన ముఖ్యంశాలు ఏమిటంటే...

మామ చెప్పారు... అల్లుడు చేశారు. గూగుల్ మ్యాప్ ను ముందు పెట్టకుని ప్రాజెక్టు రూపకల్పన. దేశంలో సీకెంట్ ఫైల్ తొ ఏ ప్రాజెక్టు నిర్మాణం జరగలేదు. డయాఫ్రం వాల్ కు 30 శాతం ఖర్చయ్యేదాన్ని వంద శాతం ఖర్చుతో సీకెంట్ ఫైల్ కు వెళ్లారు. దీనికి అధికారులకు గాని, ఏజేన్సీలు నవయుగ, ఎల్ అండ్ టి/ %ూఖీజూచీ% ఎలాంటి అనుభవం లేదు. మహా అనుభవజ్ఞులైన హరీష్ రావు గారు సీకెంట్ ఫైల్ కు కింగ్ పిన్.. డయాఫ్రం వాల్ కాంక్రీట్ తో కాకుండా సికెంట్ ఫైల్ వాల్ టెక్నాలజీ తో కట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కూలింది, మేడిగడ్డలో కేసీఆర్ ఫామ్ హౌస్ లోని భావి సైజులో రంధ్రం పడింది. ఒకే టెక్నాలజీ తో మేడిగడ్డ, అన్నవరం సుందిళ్ల బ్యారేజీలు కట్టారు ఈ మూడు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయి లక్ష కోట్లు గోదావరిలో కొట్టుకుపోవడానికి ఈ సీకెంట్ ఫైలే.. ఇద్దరు మామ అల్లుల్ల నిర్ణయమే ఈ ప్రాజెక్టు దుస్థితి... గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 25 రోజుల్లో 3 నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకుంది. రాత్రికి రాత్రికి నిర్ణయాలు తీసుకుంది రాజీవ్ సాగర్ - ఇందిరా సాగర్ నిర్మాణ వ్యయం 18 వేల కోట్లకు పెంచి దోచుకున్నారు తుమ్మిదిహట్టికి బదులు మేడిగడ్డ, కాళేశ్వరం పేరిట ప్రాజెక్టులు ప్రారంభించి లక్ష కోట్లు దోచుకోవాలన్న దురాశతో వ్యవహరించారు కేవలం ఒక ఆపరేటర్ ని పిలిచి గూగుల్ మ్యాప్ సాయంతో ప్రాజెక్టులు నిర్మాణానికి కెసిఆర్ ప్లాన్ తయారు చేశారు కెసిఆర్ రాజీవ్ సాగర్ - ఇందిరా సాగర్ ప్రాజెక్టుల శంకుస్థాపన సమయంలో నేను బిఆర్ఎస్ లో లేను వైసీపీలో ఎంపి గా ఉన్నాను 2016 ఫిబ్రవరి 17 లో డీపీఆర్ కు వ్యాప్కోస్ నివేదిక ఆమోదం రాగా, మార్చి ఒకటో తేదీకే అంటే 12 రోజుల్లోనే 1 లక్ష 47 వేల కోట్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలుపడం టెండర్ పిలవడం వెనుక అవినీతి ఉంది ఏం ఆత్రుత వచ్చిందని 11వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రాణహిత ప్రాజెక్టు వదిలేసి మేడిగడ్డ కట్టాలనుకున్నారు..? కమీషన్ల కోసమే కదా..!!

## మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన గౌరవం

- ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆహ్వానం
- స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని పిలుపు
- ఆహ్వాన లేఖను పంపిన ఆస్ట్రేలియన్ హైకమిషన్



హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు మంత్రి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి మంత్రికి ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రతిష్టాత్మక స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో పాల్గొనాలని మంత్రి లోకేశ్కు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రశంసించింది. ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ ను కోరింది. గత 20 ఏళ్లలో భారత్ కు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో పర్యటించారని పేర్కొంది. 2001లో ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఇందులో పాల్గొన్నారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది.

## సీఎం రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ తరహా పట్టుదల ప్రదర్శించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టాలని డిమాండ్
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం పోరాడాలని పిలుపు
- బీసీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ
- తెలంగాణ సాధనలో కేసీఆర్ దీక్షను గుర్తు చేసిన కేటీఆర్
- బీసీ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు అని స్పష్టీకరణ



హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ కీలక సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు కేంద్రం ఆమోదం పొందేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## చైనాతో స్నేహమా?.. మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్

- టియాంజిన్‌లో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ
- చైనా పట్ల కేంద్రం మెతక వైఖరి అవలంబిస్తోందని కాంగ్రెస్ ఆగ్రహం
- సరిహద్దుల్లో చైనా దురాక్రమణను చట్టబద్ధం చేస్తున్నారని ఆరోపణ
- గల్వాన్ వీరుల త్యాగాలను ప్రభుత్వం విస్మరించిందని జైరాం రమేశ్ విమర్శ
- చైనా వస్తువుల డంపింగ్, హైడల్ ప్రాజెక్టుపై ప్రభుత్వ మౌనాన్ని నిలదీత
- చైనా దూకుడుకు తలొగ్గడం కొత్త భద్రతా విధానమా అని ప్రశ్న



ఢిల్లి వెలుతురు ఆగస్టు 31: ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత

(మొదటి పేజీ తరువాయి..)

## సిరిసిల్ల వరద బాధితులకు రూ.10 లక్షల సాయం

ఆదుకోవాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ఆకాల వర్షాలతో నష్టపోయిన సిరిసిల్ల జిల్లా ప్రజలను ఆదుకునేందుకు రూ.10 లక్షల రూపాయలను అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఈ మొత్తాన్ని సంబంధిత సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు త్వరలోనే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆకాల వర్షాలతో సిరిసిల్ల జిల్లాలో భారీ ఎత్తున నష్టం సంభవించిందన్నారు. రైతులకు పెద్ద ఎత్తున పంట నష్టం సంభవించిందని, పలువురు నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపీ లాడ్స్ నిధుల మొత్తాన్ని సిరిసిల్ల జిల్లా బాధితులను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సవరణ బిల్లులకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

బీఆర్ఎస్ హయాంలో చేసిన పంచాయతీరాజ్ చట్టం-2018, మున్సిపాలిటీల చట్టం-2019 వల్లే రిజర్వేషన్లు 50 శాతానికి మించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీసీల సాధికారతకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వానికి నిజాయతీ లేదని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం మార్చిలో ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందడానికి ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఈ ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. తమ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగానే మార్చిలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపామని, అవి గత ఐదు నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈలోగా ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రయత్నిస్తే, ప్రతిపక్షం గవర్నర్‌ను ప్రభావితం చేసి అడ్డుకుందని ఆరోపించారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోసం ఐదుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని, అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు సాయం చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్‌ను కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

## బీసీ బిల్లును వ్యతిరేకిస్తే రాజకీయ సమాధి

'బిసిల యుద్ధభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కోర్టుకు ఏవరు వెళ్ళరాదని, ఏవరైన వెళితే పోరాడి విజయం సాధిస్తామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వేలాది హాస్టల్స్, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్షిప్ లు, ఫీజుల రీయంబర్స్మెంట్ పథకాలను సాధించడం జరిగిందని, ఈ పథకాలన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రీయంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుక రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఎత్తివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ దోపిడి, అన్యాయం, అణిచివేతకు గురైన బిసిలు రాజ్యాధికారం సాధించాలని, ఇది సాధ్యం కావాలంటే బిసిలంతా ఐక్యంగా ఉండి బిసిలకే ఓట్లు వేయాలని సూచించారు. 56 శాతం ఉన్న బిసిలు రాజ్యాధికారంలో లేకపోవడం దారుణమన్నారు. ఆర్.కృష్ణయ్య తన జీవితాన్ని బిసిలకే అంకితం చేశారని, ఆయన వెంట ఉండి రాజ్యాధికారం సాధించాలన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ మాట్లాడుతూ ఒక శాతం జనాభా ఉన్నవారు రాజ్యాన్ని పాలిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో బిసి బిల్లు ప్రవేశపెడుతుంటే మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌజ్ లో పడుకోవడానికేనా ఓటర్లు గెలిపించిందని ప్రశ్నించారు. బిసిలు చట్ట సభల్లో రిజర్వేషన్లు సాధించేంతవరకు వారి వెంట సిపిఐ ఉంటుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి సాధించాలన్నారు. మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా ప్రధాని నరేంద్రమోదీ జనగణనలో కులగణన చేపడుతున్నారని, స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో బిసిలు పోరాటం ద్వారా రాజ్యాంగ బద్దంగా రిజర్వేషన్లు సాధించాలని పిలుపునిచ్చారు. ఇందుకు తమ మద్దతు ఉంటుందన్నారు. అలాగే బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఉండాలన్నారు. ఈ సభలో బిసి నేతలు కోలా జనార్ధన్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, పి.సుధాకర్, భరత్ గౌడ్, శ్రావణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా పోటీకి 21 ఏళ్లు చాలు..

# రాజ్యాంగం సవరించాలి

మెరిట్ అవార్డ్స్-2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కీలక డిమాండ్ చేశారు. "21 ఏళ్లకే ఐఏఎస్ అధికారులు జిల్లాలను సమర్థంగా పరిపాలిస్తున్నప్పుడు, అదే వయసున్న యువకులు ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదు?" అని ప్రశ్నించారు. దీని కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేశారు. 2026లో జరగబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికలు, 2029లో దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి డబ్బు, అధికారం, మీడియా మద్దతు లేకపోయినా.. ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తెలంగాణ నుంచి పోటీ చేయమని ఆహ్వానించామని, కానీ వారు కేరళను తమ కర్మభూమిగా ఎంచుకున్నారని చెప్పారు. బీజేపీ యువత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. "దేశంలో మార్పు తీసుకురాగల శక్తి యువతకు ఉంది. యువతే మా బ్రాండ్ అంబాసిడర్లు. వారి భవిష్యత్తు కోసం వారు చేసే పోరాటం కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పెద్ద ఉద్యమం నడుస్తోందని, అందులో అందరూ చేరాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధి నమూనా గురించి మాట్లాడుతూ, 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. రాష్ట్రంలో కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, 100 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

## ఇక మనం పోటీదారులం కాదు, భాగస్వాములం... ఎస్‌సీవో వేదికగా స్పష్టం చేసిన మోదీ, జిన్‌పింగ్

సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. భారత్, చైనాలు పరస్పరం పోటీదారులు కావని, అభివృద్ధిలో భాగస్వాములని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలుగా మారకూడదని వారు బలమైన ఏకాభిప్రాయానికి వచ్చారు. గత ఏడాది (2024) రష్యాలోని కజన్‌లో జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో సాధించిన పురోగతిని మోదీ, జిన్‌పింగ్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఇరు దేశాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ఆర్థిక వృద్ధికి, ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థకు ఎంతో ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. గత ఏడాది సరిహద్దుల నుంచి ఇరు దేశాల సైన్యాలు విజయవంతంగా వైదొలగడం, అప్పటి నుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతుండటంపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దు వివాదానికి సంబంధించి ఇరు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ కోణంలో న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా, నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం, వీసా విధానాలను సులభతరం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అంగీకరించారు. ఇటీవల కైలాస మానససరోవర యాత్ర, పర్యాటక వీసాలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై కూడా లోతైన చర్చ జరిగింది. ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు పోషించగల కీలక పాత్రను ఇరువురు నేతలు గుర్తించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా రాజకీయ, వ్యూహాత్మక మార్గనిర్దేశంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు. "భారత్, చైనా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అనుసరిస్తాయి. మన సంబంధాలను మూడో దేశం కోణంలోంచి చూడకూడదు" అని ఆయన అన్నారు. ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై బహుళపక్ష వేదికల మీద ఉమ్మడి వైఖరిని అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కై కీతో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. మోదీ-జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి చైనా సిద్ధంగా ఉందని కై కీ తెలిపారు. ఎస్‌సీవో సదస్సు నిర్వహణలో చైనా అధ్యక్షతకు ప్రధాని మోదీ మద్దతు తెలిపారు. అదేవిధంగా, 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాల్సిందిగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి జిన్‌పింగ్ ధన్యవాదాలు తెలుపుతూ, భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ తరహా పట్టుదల ప్రదర్శించాలి

ఆదివారం శాసనసభలో పంచాయతీ రాజ్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. "ప్రధానికి ఐదుసార్లు లేఖ రాశానని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అపాయింట్‌మెంట్లు అడగడం కాదు, చిత్తశుద్ధిని చాటుకోవాలి. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే, రేవంత్ రెడ్డి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ బిల్లు పాసయ్యే వరకు నిరవధిక నిరాహార దీక్షకు దిగాలి" అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఢిల్లీ వెళ్లి, లక్ష్యం నెరవేరే వరకు తిరిగి రానని ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు.

"అదే తరహా పట్టుదలను రేవంత్ రెడ్డి కూడా ప్రదర్శించాలి. బీసీ బిల్లు సాధించే వరకు ఢిల్లీలోనే ఉండాలి" అని అన్నారు. 2004లోనే దేశంలో తొలిసారిగా ప్రత్యేక ఓబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన, చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపామని వివరించారు. బీసీ రిజర్వేషన్లపై ఐదుసార్లు మాట మార్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఎలా నమ్ముతారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

"42 శాతం బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌కు మేము పూర్తిగా మద్దతు ఇస్తున్నాం. కానీ చట్టాలు లొసుగులు లేకుండా ఉండాలి. లేదంటే న్యాయ సమీక్షలో అవి నిలబడవు. కేవలం ప్రకటనలు కాదు, నిబద్ధత ముఖ్యం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# చైనాతో స్నేహమా?.. మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్

విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. "చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు" అని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు.

"ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలు చేస్తోంది" అని ఆయన ఆక్షేపించారు. దేశీయంగా చైనా ఉత్పత్తుల డంపింగ్ విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (MSME) తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యార్లంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై చైనా నిర్మిస్తున్న భారీ హైడల్ ప్రాజెక్టు వల్ల ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కాగా, ఇరు దేశాల మధ్య ఆర్థిక పురోగతి కోసం స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలను నిర్మించుకోవాలని మోదీ, జిన్‌పింగ్ తమ భేటీలో నిర్ణయించుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

## రమాదేవి నియామకంలో శైలజా రామయ్యర్ ప్రమేయం లేదు

**- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**




**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31:** ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనం, కొంతమేర తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే విధంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఆదివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం నుంచి వేములవాడ ఈవోగా రమాదేవి నియామకం ఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అభిష్టం మేరకు జరిగిందని వార్త కథనం ప్రచురితం అవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఈ విషయం పూర్తిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా తన సమ్మతితో జరిగిందన్న విషయం పత్రికా సోదరులు గుర్తించాలన్నారు. సదరు ఈవో రమాదేవిని తొలుత హౌసింగ్ డిపార్టుమెంటుకు పంపాలని ఆదేశాలు రాగా... సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆమోదం తీసుకొని మళ్ళీ ఎండోమెంటు డిపార్టుమెంటులో ఆమెను కొనసాగించేందుకు మరియు వేములవాడ ఈవోగా ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిపారు. కాగా, ఈ అంశంలో శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ గారి సొంత నిర్ణయం ఏమాత్రం లేదని గుర్తించాలని మీడియా మిత్రులకు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

## యాదగిరిగుట్ట సేవలకు అరుదైన అంతర్జాతీయ గుర్తింపు

**- టెంపుల్ నిర్వాహకులను అప్రిషియేట్ చేసిన కెనడా ప్రధాని మార్క్ కార్నీ**

**- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హర్షం**




PRIME MINISTER · PREMIER MINISTRE

Message from the Prime Minister of Canada


**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31:** తెలంగాణలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి టెంపుల్ సేవలకు అరుదైన అంతర్జాతీయ గుర్తింపు లభించింది. కెనడాలోని లక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో భక్తులకు అందుతున్న సేవలపై టెంపుల్ బోర్డును కెనడా ప్రధాని మార్క్ కార్నీ అప్రిషియేట్ చేశారు. ఈ మేరకు ఆదివారం యాదగిరిగుట్ట టెంపుల్ కు ఆయన రాసిన లేఖ చేరింది. కెనడాలోని ఒట్టవా నగరంలో గల లక్ష్మీ నరసింహా దేవాలయంలో ఇటీవల జరిగిన స్వామి వారి కళ్యాణం జరిగిన తీరుతెన్నులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్వామి వారి కళ్యాణంగా చాలా ఘనం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా హిందూ సంస్కృతిలోని విభిన్నత... ఆధ్యాత్మికత, ఐక్యతను ప్రశంసించారు. కెనడాలోని హిందూ భక్తులను ఐక్యంగా చేస్తూ దైవ సంబంధిత కార్యక్రమాలు నిర్వర్తిస్తున్న ఆర్గనైజర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ లేఖపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ ఈవో వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు. స్వామి వారి సేవలను రానున్న రోజుల్లో మరింత భక్తులకు అందజేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయడం అభినందనీయం

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31:** బీసీ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంచుతూ చట్టం చేయడానికి అసెంబ్లీలో చర్చలో పాల్గొని మద్దతు తెలియజేసిన టిఆర్ఎస్ బిజెపి సిపిఐ ఎంఐఎం పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు లింగం గౌడ్ పేర్కొన్నారు.అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టానికి రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలని బీసీ రిజర్వేషన్ల పెంపు చట్టానికి యావత్ తెలంగాణ సమాజం సహకరించి మద్దతు తెలపాలని,బీసీ రిజర్వేషన్లపై దయచేసి ఎవరు కోర్టుకు వెళ్లొద్దనీ, న్యాయస్థానాలను అడ్డం పెట్టుకొని బీసీల నోటికాడ ముద్దను గుంజుకోవద్దని బీసీ సంఘాల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం.




నేను తెలంగాణ విమోచన దినం సెప్టెంబర్ 17 అంశంపై మూడు పుస్తకాలు రాసాను. మరుగునపరచిన నిజాం నియంత్రత్వ పాలనను,రజాకార్ల హత్యలను, అరాచకాలను, మహిళలపై జరిగిన అత్యాచారాలను, నిజాం వ్యతిరేక పోరాటాలను, పోరాటయోధుల గురించి ఆ పుస్తకాలలో వివరించి రాసాను.. అయితే "విమోచన" మీద భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు విమోచన కాదని, విలీనం అని, కొందరు విద్రోహం అని,మరికొందరు దురాక్రమణ అని రకరకాలుగా వాళ్ళవాళ్ళ స్వప్రయోజనాలకోసం, రాజకీయ అవసరాలకోసం సెప్టెంబర్ 17 ను వాడుకుంటున్నారు.. నా పుస్తకాలలో వాస్తవాలు వివరించినా, సోషల్ మీడియా మిత్రులకోసం నేటి నుంచి 17 సెప్టెంబర్ వరకు ప్రతిరోజూ రజాకార్ల అరాచకాలపై, నిజాం పాలనపై యధార్ధగాధలను రాస్తాను..

**ధన్యవాదాలు...**
**మీ కపిలవాయి రవీందర్.** MCJ
(Master of Communication and Journalism)
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్..**

వెలుతురు

## అసెంబ్లీలో బీసీలకు 42% రిజర్వేషన్ల ఆమోదం..

**- బీసీల విజయం**

**- జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం**



**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 31:** తెలంగాణలో చారిత్రాత్మకంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు అసెంబ్లీ ఆదివారం ఆమోదం బీసీల సమిష్టి విజయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అన్నారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... "స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడమే లక్ష్యంగా, పంచాయతీరాజ్ చట్టం–2018, పురపాలక చట్టం–2019లో ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తూ సవరణ బిల్లులు ప్రవేశపెట్టడం, వాటిని అసెంబ్లీ ఆమోదించడం సంతోషకరమైన పరిణామం" అని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చల అనంతరం అన్ని పార్టీలు ఏకగ్రీవంగా బిల్లులకు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన, త్వరలోనే 42 శాతం రిజర్వేషన్లు కార్యరూపం దాల్చనున్నాయని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం కావడం తెలంగాణ రాజకీయ, సామాజిక చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని, ఇది బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధికి, సామాజిక న్యాయానికి పునాది వేస్తుందని అని అన్నారు.

## మంచాలలో యూరియా కోసం రైతుల తిప్పలు

**- గత పదేళ్ల కాలంలో యూరియాకు తిప్పలులేవు రైతుల ఆవేదన**

**- వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి యూరియా సరఫరా చేయాలి**



**మంచాల వెలుతురు ఆగస్టు 31:**
మంచాల మండలం కేంద్రంలో వ్య వసాయ సహకార సంఘం ముందు యూరియా కోసం రైతుల క్యూలైన్ లో బారులు తీరి గంటల తరబడి క్యూలైన్ లోనిలబడి రైతులు నానఇబ్బందులు ఎదుర్కొంటున్నారు యూరియా సరిపడ సరఫరా కాకపోవటంతో సహకార సంఘం సిబ్బంది రైతులకు సరైన సమాధానం చెప్పలేక పోతున్నారు ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత ఈ పదేండ్ల కాలంలో యూరియకు ఎప్పుడు కూడా ఇబ్బంది కాలేదు అన్నారు ఇప్పుడు యూరియా లేక పోవటంతో పొలాలు పూర్తిగా సాగు చేసుకొలేక పోతున్నాం కొన్ని పొలాలు సాగుచేసి నాట్లు వేశం యూరియా వేయాలి యూరియా లేదు అప్పులుచేసి మరీ పొలాలు సాగు చేసుకున్నాము వారి నాట్లు వేసుకున్నాము యూరియా వేయకపోతే పంటపండదు అని రైతులు ఆందోళన చెందుతున్నారు,రైతులేనిదే రాజ్యం లేదు రైతుని రారాజు చేస్తాం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం అని గొప్పలు చెప్పిన నాయకులు యూరియా కోసం రోజుల తరపడి క్యూలైన్లో తిండితిప్పలు లేక నిలబడి వేచి ఉంటే పట్టించుకూనే నాయకులు ఎక్కడ అని రైతులు ప్రశ్నిస్తున్నారు వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు సరిపడ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## "ఓటు చోర్ - గద్దీ చోడ్

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ హెచ్చరిక"



**హైదరాబాద్ గాంధీ భవన్ వెలుతురు ఆగస్టు 31:** మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ అనుమతితో, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీ భవన్ లో "ఓటు చోర్ – గద్దీ చోడ్" ధర్నా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు రేఖ బోయలపల్లి పాల్గొన్నారు. పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా మహిళా నాయకులను గృహ నిర్బంధించినప్పటికీ, మహిళా కాంగ్రెస్ నాయకత్వం మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు రేఖ బోయలపల్లి మాట్లాడుతూ ప్రధాని మోడీ అధికారం అడ్డం పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. మహారాష్ట్రలో కోట్లకొద్దీ ఓట్లు అక్రమంగా చేర్చడం, బీహార్లో 60 లక్షల పైగా ఓట్లను తొలగించి తమకు అనుకూల ఓట్లు చేర్చడం ఓటు చోరీకి నిదర్శనాలు. ఇది ప్రజాస్వామ్యంపై అత్యంత ప్రమాదకర దాడి. ఎలక్షన్ కమిషన్, మోడీ ప్రభుత్వం ఈ కుట్రకు బాధ్యత వహించి, రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి" అని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మరియు జిల్లా స్థాయి మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## వినాయకుని కృప అందరికి సిద్ధించాలి...జిల్లా గణేష్ నేత..

**కూకట్ పల్లి ఆగస్ట్ 31 వెలుతురు:**



వినాయకుని కృప భక్తులతో పాటు ప్రజలందరికి సిద్ధించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత అన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్, సాయి నగర్, మహంకాళి నగర్, వెంకటపాపయ్య నగర్, తంగరాజు బస్తి, పాపమ్మ బస్తి, పంచమి కాలని, పీజేఆర్ నగర్ 1,2 వ పేస్ పలు కాలనీలలో కొలువుదీరిన వినాయక మండపాల కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు ఆదివారం ఆయన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారని ఆ వినాయకుని కృప మన అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంగమేష్, రవి, ముజీబ్, లాలన్, వెంకటకృష్ణ, రవీందర్, తాయప్ప, యాదగిరి, వేలు, రాంచెదర్, గణేష్, మధు,ఎదుపాయల శ్రీను, రాము, సిల్వరాజ్, శ్రీను, అంజి కాలనీ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే రాష్ట్రం అగ్నిగుండం చేస్తాం

**- 42 శాతం అమలు చేస్తామని మరోసారి మోసం చేస్తే సహించేది లేదు.**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 31:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మారుస్తామని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్లు అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టే విజయ కుమార్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్ లు హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి మరోసారి రాజకీయ పార్టీలు మోసం చేస్తే సహించబోమని వారు హెచ్చరించారు. ఆదివారం చిక్కడపల్లిలోని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... 42 శాతం రిజర్వేషన్ పై అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగిందని దీనికి పార్లమెంట్లో చట్టబద్దత కల్పించి 9వ షెడ్యూల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. కమిషన్ల పేరుతో కాలయాపన చేయాలని చూస్తే కబాడ్దార్ అని హెచ్చరించారు. జివోలతో రిజర్వేషన్లు అమలు కావని వెంటనే 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేయాలని చూస్తున్నాయని బీసీలంటే జెండాలు మోసే వారుగా, ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా తిరగబడితే ఏ పార్టీలకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కులగణన ప్రకారం బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇవ్వలేని మీరు చట్ట సభల్లో ఎలా అవకాశం కల్పిస్తారని ప్రశ్నించారు. చిత్త శుద్ధి లేకుండా పార్టీలు వ్యవహరిస్తున్నాయని బీసీలంతా చైతన్యం కావాలని వారు పిలుపునిచ్చారు. ఉప రాష్ట్రపతి ఎంపిక విషయంలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించకపోవడం భాదకరమన్నారు. బీసీలు మేధావులు, రిటైర్ట్ ఐఏఎస్, ఐపిఎస్లు ఉండగా అగ్ర కులానికి అవకాశం ఇచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ నాయకులు బైరు శేఖర్, దామోదర్ గౌడ్, ముత్యం ముఖేష్ గౌడ్, గజ్జే శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నాలు తొలగించి విజయాలను అందించే మహాగణపతి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి...

**- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ..**

**కూకట్ పల్లి ఆగస్టు 31 వెలుతురు:**



విఘ్నాలు తొలగించి విజయాలను అందించే మహాగణపతి ఆశీస్సులు అందరికీ లభించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పీఏసీ చైర్మన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధిలో రామకృష్ణ వెల్ఫేర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాగణపతిని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సకల లోకాల సర్వ జనులకు శుభాలు కలిగించే బొజ్జ గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్కే స్ట్రీట్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ రావు, సంజీవరెడ్డి, కార్యదర్శి రాంచంద్రావు, కమిటీ సభ్యులు జి ప్రసాద్, సుధాకర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, జలంధర్ రెడ్డి, నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి, యూత్ కమిటీ సభ్యులు సాయి భార్గవ్, క్రాంతి, నందు, రిత్విక్, అశ్విత్, అనిల్, మహిళలు సుభాషిని, లక్ష్మి, అన్నపూర్ణ, మంజుల, వరలక్ష్మి, పార్వతి, శ్రీవాణి, కరుణ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## విగ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి..

**- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు...**

**కూకట్ పల్లి ఆగస్టు 31 వెలుతురు:**



విఘ్నాలను తొలగించి విజయపథంలో నడిపించే విగ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. వినాయక చవితి సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని మాధవరం నగర్ కాలనీ ఏ బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్, నవభారత వెల్ఫేర్ అసోసియేషన్ వెంకటేశ్వర్ నగర్, ఏఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఈనాడు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, వివి నగర్ అపార్ట్మెంట్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్విన్ కాలనీ 1వ,ఫేస్ వెల్ఫేర్ అసోసియేషన్, వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్ 5వ,రోడ్, వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్ 9వ రోడ్, దినబంధు కాలనీ చౌరస్తాలో, లక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, కూకట్ పల్లి శివాలయం వీధిలో, లక్ష్మీ సాయి అపార్ట్మెంట్ జీవి హైట్స్, ప్లాట్ నెంబర్ 360 వద్ద, వివేకానంద నగర్ కాలనీ లలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల వద్ద ఆదివారం వారు గణపతి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజాదేవి మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద కాలనీలలోనూ, అపార్ట్మెంట్లలోనూ ఉన్న సభ్యులందరూ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని, ఆ విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరిపై ఉండేలా ప్రార్థించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వినాయక మండపాల సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న గణేశ్ నవరాత్రోత్సవాలు...

**- కూకట్ పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం..**

**కూకట్ పల్లి ఆగస్టు 31 వెలుతురు:**



కూకట్ పల్లి లో గణేశ్ నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కూకట్ పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద గణనాథు లకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆదివారం ఘనంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమం గుండాల నర్సింగరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గుండాల శ్రీనివాస్ రావు సౌజన్యంతో దాదాపు 6000 మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో చింతపట్ల హనుమంతరావు, అర్చనపల్లి సూర్య రావు, నాయినేని పద్మారావు, చౌదరి నర్సింగరావు, చౌదరి సూర్య రావు, గుడిగంటి పాపారావు, డి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో ఘనంగా గణనాధుడి నిమజ్జనం..

**కూకట్ పల్లి ఆగస్టు 31 వెలుతురు:**



నిజాంపేట శ్రీనివాస నగర్ హరి శ్రీ అవెన్యూస్ అపార్ట్మెంట్లో వినాయక నిమజ్జన మహోత్సవకార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల గణేష్ పూజలు ఘనంగా చేయడమే కాకుండా పిల్లలందరికీ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి శ్రీనివాస్ బ్లూ ఎక్స్ స్టోన్ కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో మెమొంటోలు ఇవ్వడమే కాకుండా సరస్వతి పూజ పిల్లలతో చేయించారు. అదేవిధంగా గోల్డెన్ బెల్స్ అపార్ట్మెంట్ నందు ఘనంగా పూజలు చేయడం కాకుండా హనుమంతరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని తమ ఇష్టదైవమైన వినాయకుడినికి పూజలు నిర్వహించారు. గత ఐదు రోజుల నుండి దీప ధూప నైవేద్యాలతో విశేషంగా పూజలందుకున్న గణనాధుడు ఆదివారం ఘనంగా నిమజ్జనానికి తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి వంశీకృష్ణ, ఆకుల సతీష్, హనుమంతరావు, శ్రీనివాసరావు, మాధవరావు, అరుణ్, ఈశ్వర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నిజాంపేట మున్సిపల్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో తో పాటు పలు చోట్ల గణాధుడి నిమజ్జనాలు ఘనంగా జరిగాయి.

## లడ్డూల వేలం పాటలో పాల్గొనండి

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 31 :**



నారాయణఖే పట్టణంలో శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో ప్రతిష్టించిన వినాయకుని లడ్డూల వేలంపాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు బాధ్యులు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజ కార్యక్రమం వారు మాట్లాడుతూ శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో రెండో వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడు సోమవారం శోభాయాత్ర కార్యక్రమం కంటే ముందు లడ్డూల వేలంపాట ఉంటుందని తెలిపారు. అనంతరం పద్మశాలి యువజన సంఘం, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

### గణనాథుడి ప్రత్యేక పూజల్లో


## మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి...



**కూకట్ పల్లి ఆగస్టు 31 వెలుతురు:**
వినాయక చవితి సందర్భంగా బాలానగర్ డివిజన్ లోని శ్రీశ్రీనగర్, ఇంద్ర నగర్ లలో స్థానిక గణేష్ ఉత్సవ సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆదివారం ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బందీగా బాలనర్సింహా, శ్రీ శ్రీ నగర్ అధ్యక్షుడు దుర్గేష్, జనరల్ సెక్రెటరీ కిట్టు, ఇంద్రనగర్ మాజీ అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి, క్యాషియర్ రాజు, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్, మురళి యాదవ్, మాదరి శ్రీనివాస్, మైనారిటీ నాయకుడు ముక్తార్ అహ్మద్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు..

**- పూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి.**





**మేడిపల్లి వెలుతురు ఆగస్టు 31:**
వినాయక చవితిని పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐదవ రోజు పూజా కార్యక్రమంలొ భాగంగా ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి వివిధ కాలనీలోని గణనాధులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమములలో పాల్గొని భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలొ వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు,ఉత్సవ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదలు స్వీకరించారు.

## బీ.సి సంక్షేమానికి కృషి చేస్తా

- కొత్తపల్లి సతీష్.



**మేడిపల్లి వెలుతురు ఆగస్టు 31:**
జనగామ నియోజకవర్గానికి చెందిన కొత్తపల్లి సతీష్ కుమార్ పీర్జాదిగూడ లోని బిసి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న,తెలంగాణ బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ను మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ %–% బిసి రాజ్యం స్థాపన కోసం అందరు ఏకతాటిపైకి వచ్చి కట్టుగా శ్రమించాల్సిన అవసరం ఉందని,2028 ఎన్నికల్లో బిసి జెండాను ఎగరవేయాలని అన్నారు. ఈ సందర్భంగా మల్లన్న కొత్తపల్లి సతీష్కు బిసి పొలిటికల్ జేఏసీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సతీష్ మాట్లాడుతూ బీ.సి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. మల్లన్న నాయకత్వంలో రాబోయే పార్టీలో భాగస్వామ్యమై కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు బిసి పొలిటికల్ జేఏసీ నేతలు పాల్గొన్నారు.



# కోదండరాం రెడ్డి పదవుల ప్రయాణం....
# ప్రజలకు ప్రయోజనం ఏమిటి?

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా నిలిచిన ప్రజా సమితుల్లో ఒకటి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ). దీనికి చైర్మన్‌గా ఉన్న కోదండరాం రెడ్డి అప్పుడు ఉద్యమానికి ముఖచిత్రంగా వెలిశారు. రాష్ట్రం కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగాలు ఆశించే నిరుద్యోగులు, రైతులు, కూలీలు అంతా కలిసిన అఖండ శక్తిగా ఎదిగిన ఉద్యమాన్ని సమన్వయం చేసిన కోదండరాం, తెలంగాణ కల సాకారం కావడానికి తమ వంతు పాత్ర పోషించారు అనే అభిప్రాయం ఉంది.అయితే రాష్ట్ర ఏర్పాటైన తరువాత ఆయన పాత్ర ఏ విధంగా మారింది? ఉద్యమ సమయంలో ప్రజలకు, నిరుద్యోగులకు, అమరవీరులకు హామీలు ఇచ్చిన వారు నేటి పరిస్థితుల్లో ఏమి చేశారు అన్నదానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఉద్యోగాల కలలు - నిరుద్యోగుల ఆక్రోశం

తెలంగాణ ఏర్పడిన తరువాత తొలితరం ముఖ్యంగా ఎదురుచూసింది ఉద్యోగ భద్రత. "జాబ్ ఫర్ తెలంగాణ" నినాదంతో ఉద్యమించిన యువత ఇప్పుడు "జాబ్ కోసం పోరాటం" చేస్తోంది. కోదండరాం ఉద్యమ సమయంలో నిరుద్యోగుల పక్షాన నిలిచినా, ఆ ఉద్యమం ఫలితంగా ఏర్పడిన ప్రభుత్వం, తర్వాతి పదవులలో ఆయన స్వయంగా ఉన్నా - నిరుద్యోగ సమస్య పరిష్కారమైంది అనే అర్థం మాత్రం లేదు. 10 సంవత్సరాల పాలనలో వేల కొద్దీ ఉద్యోగాలు ఖాళీగా ఉండిపోయాయి. నియామకాల ప్రక్రియలు చెల్లా చెదురుగా జరిగాయి. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు తూటా కాలిపోయినట్టే కనిపిస్తున్నాయి. దీనిపై కోదండరాం మౌనం పాటించడం, లేదా గట్టిగా స్పందించకపోవడం ఆయన పట్ల నిరుద్యోగుల నమ్మకాన్ని దెబ్బతీసింది.

ఇక తెలంగాణలో కొత్త ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ముందు నిచ్చెన ఎక్కేందుకు యువతకు ఇచ్చిన ముఖ్యమైన హామీ ఉద్యోగాల భర్తీ. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో అధికారికంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తూ, "2025 జూలై 30వ తేదీలోగా అన్ని ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తాం" అని బిగ్గరగా ప్రకటించారు. అయితే గడువు ముగిసింది. కానీ నోటిఫికేషన్లు మాత్రం ఒక్కటీ విడుదల కాలేదు. ఒక ప్రభుత్వానికి విశ్వసనీయతను నిరూపించుకునే అవకాశం మొదటగా ఉద్యోగాల భర్తీలోనే ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా, ఉద్యోగాల విషయంలో పూర్తిగా విఫలమైందనే అభిప్రాయం నేడు ప్రజల్లో పటిష్టంగా వుంది.జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ఒక్కటే కాదు, ఆ ప్రకటనలన్నీ ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకు చేసిన ప్రదర్శనగా నిలిచిపోయాయి. వాస్తవంగా చూస్తే, ఇటీవల విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో గ్రూప్-1, గ్రూప్-2, టీఆర్బీ, పోలీస్ డిపార్టుమెంట్లు, ఆరోగ్య శాఖ వంటి అనేక విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి సమయ నిర్దేశంతో ప్రకటనలు ఇచ్చారు. కానీ వాటిలో ఒక్క నోటిఫికేషన్ కూడా వెలువడలేదు. పదవులు ఇచ్చిన వెంటనే ఓట్లకే పరిమితమైపోయిన ప్రభుత్వానికి నిరుద్యోగ యువత భవిష్యత్తు పెద్దగా కనిపించట్లేదు. కొత్త జాబ్ నోటిఫికేషన్లు వెలువడడం తప్పితే, గత టీఏఎస్‌పీసీ పరీక్షల ఫలితాలే ఇప్పటికీ పూర్తి కాక పోవడం, అభ్యర్థుల మధ్య ఆశాభంగాన్ని కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక యువకుడు - కాంగ్రెస్ నేతను నిలదీస్తూ - "ఉద్యోగాలు ఇవ్వలేరు అంటే మా పెళ్లిళ్లు కూడా మీరే చేయండి. మమ్మల్ని మీరే పోషించండి" అంటూ తీవ్రంగా విమర్శించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియోలో వ్యక్తమైన భావోద్వేగం నేడు లక్షలాది నిరుద్యోగ యువత ఆశలను ప్రతిబింబిస్తోంది. కొంతమంది నిరుద్యోగులు ఇప్పటికే హెచ్చరించడంతో పాటు, "ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వకపోతే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమే పోటీ చేస్తాం" అంటూ స్వరాన్ని పెంచుతున్నారు. దీనిద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఆగస్టులో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. తరువాత మున్సిపల్ ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలు... ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ల ప్రకటనలు మరింత వాయిదాపడే అవకాశాలే ఎక్కువ. ఎన్నికల నియమావళి అమలవుతున్న సమయంలో ఉద్యోగాల ప్రకటనలు ఇవ్వడం సాధ్యపడదు.

అంతేకాదు, త్వరలో పంచాయతీ రాజ్, నగరపాలక శాఖల్లో రాజకీయ పదవుల కోసం అభ్యర్థుల ఎంపిక, పార్టీల మధ్య అంతర్గత పోరు, కూటమి పొలిటిక్స్ మొదలైనవి కాంగ్రెస్ పార్టీ శ్రద్ధని పూర్తిగా ఉద్యోగాల నుంచి మళ్లించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇప్పుడు పబ్లిక్‌లో కనిపించగానే వారిని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు తలుపులమీద తిరుగుతున్నారు. అసెంబ్లీలో అధికారికంగా ప్రకటించిన హామీని నెరవేర్చలేకపోతే, ప్రజల ముందు ఎలా నిలబడతారు? ఎన్నికల సమయంలో యువత చేత ఓటు వేయించుకుని ఇప్పుడు వారిని పట్టించుకోకపోవడం ఎంతో దురదృష్టకరం. తెలంగాణ ఉద్యమం కాలంలో నిరుద్యోగులు కీలక పాత్ర పోషించారు. ఇప్పుడూ అదే చిత్తశుద్ధితో ఉద్యమించే అవకాశం ఉంది. "ఓట్ల కోసం కాదు, ఉద్యోగాల కోసం పోరాటం చేస్తాం" అనే నినాదాలు వినిపిస్తున్నాయి. నిరుద్యోగ సంఘాలు ఇప్పుడు ఒక ఆధారిత మార్గసూచి సృష్టించుకుంటున్నాయి - న్యాయపోరాటాలు, ధర్నాలు, మౌన ప్రదర్శనలు మొదలైపోయే సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఉద్యోగాలు భర్తీ చేయడం అనేది ప్రభుత్వానికి ఒక నైతిక బాధ్యత. ఇది ఓ హామీ మాత్రమే కాదు, సమాజ నిర్మాణానికి అవసరమైన మొదటి దశ. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు వేలల్లో వున్నా, అవి నిండక పోవడం వల్ల ప్రజాసేవ నష్టపోతుంది.అంతేగాక, యువత పనిలేక నిరుత్సాహంతో ఇంట్లోనే ఉండిపోవడం వల్ల ఆర్థికంగా, మానసికంగా దెబ్బతింటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలి.

### ఉద్యమ ఆత్మాహుతులకు గౌరవం ఎక్కడ?

తెలంగాణ రాష్ట్రం కోసం 1500 మందికి పైగా యువతీ యువకులు ప్రాణాలు త్యాగం చేశారు. వారి కుటుంబాల పరిస్థితి ఇప్పటికీ దయనీయంగా ఉంది. ఉద్యమ నాయకులుగా, జేఏసీ ద్వారా ఏర్పడిన నేతలుగా తాము వారికి ఏం చేయగలిగాం అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. కోదండరాం వంటి నేతలు ఆత్మాహుతుల కుటుంబాలను గుర్తించడంలో, వారికి న్యాయం చేయడంలో ముందుండలేదనే విమర్శలు వస్తున్నాయి.

### కోదండరాం పదవుల ప్రయాణం - ప్రజలకు ప్రయోజనం ఏమిటి?

కోదండరాం ఉద్యమానికి సేవలందించిన తరువాత రాజకీయ పార్టీ స్థాపించారు. తెలంగాణ జన సమితి పేరిట ఎన్నికల్లో పోటీ చేశారు. అయినా ప్రజల నుండి అనుకున్న మద్దతు రాలేదు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎమ్మెల్సీ పదవిని పొందారు. అంటే, ఉద్యమం కోసం చేసిన నాయకత్వం చివరికి వ్యక్తిగత పదవులపైనే నిలిచిందా అన్న సందేహం సహజం. కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది, కానీ సుప్రీంకోర్టు కోర్టులో కోదండరాం రెడ్డికి వ్యతిరేకంగా దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టులో కేసు నడుస్తుంది. ఎమ్మెల్సీ పది ఉంటుందో ఊడుతుందో తెలువదు. కానీ మొన్న జరిగిన ఓయూ మీటింగ్లలో సీఎం రేవంత్ రెడ్డి తప్పకుండా మళ్లీ కోదండరాం రెడ్డికి ఎమ్మెల్సీ పదవి కచ్చితంగా ఇస్తానని వాగ్దానం చేశాడు. ఇక జేఏసీలో పనిచేసిన చాలామంది నాయకులు అనేక పార్టీల్లో స్థానం పొందారు. ఇది ఉద్యమం కోసం కృషి చేసినవారికి న్యాయమా? లేక ఉద్యమాన్నివ్యక్తిగతలాభాలకుఉపయోగించుకున్నారా? అన్నదానిపై సమగ్ర విశ్లేషణ అవసరం. ప్రజల ఆకాంక్షల నుంచి ఫామ్ హౌస్ రాజకీయాల వరకుతెలంగాణ ఉద్యమ సమయంలో కోదండరాం ప్రజల మధ్య తిరిగారు. నిరుద్యోగుల ర్యాలీల్లో పాల్గొన్నారు. కానీ, తెలంగాణ ఏర్పడ్డాక రాజకీయాలలో దూరంగా ఉన్నట్లు, ప్రజల సమస్యలపై దృష్టి సారించకుండా ఉన్నట్లు కనిపించారు. ఇది ఆయన విశ్వసనీయతను ప్రశ్నించే ప్రజలు తమ జీవితాల్లో మార్పు కోసం ఉద్యమించారు. కానీ కోదండరాం లాంటి నాయకులు ఆ మార్పును కొనసాగించలేకపోయారు. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రజలకు హామీలు ఇవ్వడంలో మాత్రం చురుగ్గా ఉండి, అమలు విషయంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో కోదండరాం రాజకీయ ప్రస్థానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది.

### కోదండరాం - విశ్వసనీయత కోల్పోయిన ఉద్యమ నేత...?

ఒక ఉద్యమ నేతగా విశ్వసనీయత కలిగిన వ్యక్తిగా వెలిసిన కోదండరాం, పదవులు స్వీకరించాక ప్రజల మద్దతు కోల్పోయినట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఆయన గొంతు మౌనంగా మారింది, ప్రజా సమస్యలపై స్పందించే తీరు సడలిపోయింది. అయితే ఒక వైపు ప్రభుత్వంపై విమర్శలు చేసినప్పటికీ, మరొకవైపు ప్రభుత్వాల నుంచి పదవులు స్వీకరించడం ప్రజలకు గందరగోళాన్ని కలిగించింది. ఉద్యమ నాయకుడిగా కోదండరాం తన దృఢత నిలబెట్టుకోలేకపోయినట్టు కనిపిస్తోంది.

కోదండరాం రెడ్డి విద్యావేత్త, ఉద్యమ నేత, రాజకీయ నాయకుడు. ఆయన సేవలు గతంలో ప్రశంసనీయమైనవే. కానీ నేటి యువత ప్రశ్నిస్తోంది, మాకు ఉద్యోగాల కోసం పోరాడిన మీరు ఇప్పుడు మాకోసం ఎక్కడున్నారు? మీకు ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి మాకు ఉద్యోగాలుగా మారిందా? ప్రజలు ఆయనపై విశ్వాసం పెట్టి ఉద్యమించారు. ఇప్పుడు అదే ప్రజలు నిరాశ చెంది ఉన్నారు. ఆయనపై ప్రజల విమర్శలు, నిస్పృహలు ఎక్కువవుతున్నాయి.

### ప్రజా మన్ననలు.. లేక ప్రజా నిరాశ?

ఒక ఉద్యమ నాయకుడిగా ప్రజలకు న్యాయం చేయాలనే ధ్యేయంతో కొనసాగాలి. కోదండరాం ఇప్పటికైనా నిరుద్యోగ యువతకు, ఉద్యమ అమరులకు, ఉద్యమ కారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలను ఒత్తిడి చేయాలి. లేకపోతే ప్రజా చరిత్రలో ఒక గొప్ప నాయకుడి పేరు - "వినిపించిన గాత్రం కానీ నిలిచిపోని కర్తవ్యం"గా మిగిలిపోతుంది.

కోదండరాం గారు ఉద్యమ సమయంలో ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలిచారు. కానీ, తెలంగాణ వచ్చిన తరువాత వారి పాత్ర మందగించింది. పదవులరాజకీయాలు లో తడిసిన ఆయన ప్రజా నమ్మకాన్ని కోల్పోయినట్టే ఉంది. ఇప్పటికైనా ఆయన నిరుద్యోగుల పక్షాన నిలిచి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే బాధ్యతను తీసుకోవాలి. అదే నిజమైన ఉద్యమ నాయకుడి గౌరవం. లేనియెడల కోదండరాం రెడ్డి ఉద్యమ ఆకాంక్షలను విశ్వసనీయతను కోల్పోయిన నేతగా తెలంగాణ సమాజం అనుకుంటుంది అనేది నగ్నసత్యం.

మన్నారం నాగరాజు



## ఆదుకుంటున్న ఆశ్రయ ఆకృతి

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 31:** సమాజంలో వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి సహాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో పనిచేస్తున్నాయి. అయితే, వారికి అవసరమైన వైద్యం వారి ఇంటి వద్దకే చేర్చేందుకు ఆశ్రయ ఆకృతి అనే స్వచ్ఛంద సంస్థ ఒక విప్లవాత్మకమైన అడుగు వేసింది. ఆరోగ్య రంగంలో సేవలు అందిస్తున్న ఆప్టమ్ ఇండియా సంస్థ సహకారంతో ఆశ్రయ ఆకృతి స్వచ్ఛంద సంస్థ మొబైల్ హియరింగ్ క్లినిక్‌ను ప్రారంభించింది. అన్ని అత్యాధునిక సదుపాయాలతో ఉన్న ఈ క్లినిక్, హైదరాబాద్‌లోని వెనుకబడిన వర్గాల గడప వద్దకే వెళ్లి చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్య సేవలను అందించనుంది. ఈ మొబైల్ క్లినిక్ ద్వారా ఆధునిక వైద్య పరికరాలు, వినికిడి పరీక్షలు, ప్రారంభ దశలోనే సమస్యలను గుర్తించడం, సరైన సమయంలో చికిత్స అందించడం వంటి కీలక సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ వినూత్న కార్యక్రమం వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారి జీవన నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా, ఆరోగ్య రంగంలో ఉన్న అంతరాలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషించనుంది. ఆప్టమ్ హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆశ్రయ ఆకృతి వ్యవస్థాపకుడు డి.పి.కె. బాబు, ఆప్టమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఉమా రత్నం కృష్ణన్ గారు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు కమ్యూనిటీ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో పేదలు, అవసరం ఉన్నవారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. అలాగే, నిపుణులైన ఈఎన్‌టి వైద్యుల నుంచి సలహాలు, సూచనలు పొందవచ్చు. ఈ సందర్భంగా మాట్లాడిన డి.పి.కె. బాబు "ఒక చిన్నారి వినికిడి శక్తిని పొందినప్పుడు వారి ప్రపంచమే ఎలా మారిపోతుందో ఆశ్రయ ఆకృతిలో మేం చూశాం. విద్య, స్నేహాలు, భవిష్యత్తు అవకాశాల కోసం కొత్త తలుపులు తెరుచుకుంటాయి. ఈ మొబైల్ హియరింగ్ క్లినిక్ ఆప్టమ్ ఇండియాతో కలిసి ఈ కలను నిజం చేయడానికి హృదయపూర్వకమైన అడుగు. మా లక్ష్యం కేవలం వినికిడి సమస్యలను గుర్తించి చికిత్స చేయడం మాత్రమే కాదు, వారికి ఆశ, గౌరవం, ఆత్మవిశ్వాసాన్ని తిరిగి తీసుకురావడమే" అని అన్నారు. ఆప్టమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఉమా రత్నం కృష్ణన్ మాట్లాడుతూ, "అర్థవంతమైన మార్పు తీసుకురావడంలో భాగస్వామ్య శక్తిపై మాకు నమ్మకం ఉంది. మా 'ఇన్ ఇండియా, ఫర్ ఇండియా' అనే నినాదంతో, మా సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా నాలుగు లక్షల మందికి పైగా ప్రత్యక్షంగా, దాదాపు పది లక్షల మందికి పరోక్షంగా సేవలు అందించగలిగాం. ఆశ్రయ ఆకృతితో మా భాగస్వామ్యం ఈ లక్ష్యానికి నిదర్శనం. మా సహకారంతో హైదరాబాద్‌లోని ప్రజలకు మరింత వినికిడి సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు ఈ మొబైల్ క్లినిక్‌తో ఆ సేవలు సమీప జిల్లాలకు కూడా విస్తరించనున్నాయి. ఇది మా సమిష్టి ప్రభావాన్ని పెంచే ఒక ముఖ్యమైన మైలురాయి" అని పేర్కొన్నారు.

## కబ్జాకు గురవుతున్న కార్పొరేషన్ భూములు

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 31:** రంగారెడ్డి జిల్లా బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పార్కు స్థలాలన్నీ కబ్జాకు గురవుతున్నాయి. ఇక్కడ విచిత్రమేమిటంటే తాటికాయ అంత అక్షరాలతో గతంలో బోర్డులు పాతిన చోటనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఆ స్థలాల్లో నిర్మాణాలకు యథేచ్ఛగా అధికారులు అనుమతులు జారీచేయడం కోసమెరుపు. ఇలా రూ.300 కోట్ల విలువైన భూములు కబ్జాకు గురైనట్లు అంచనా. ఏ పార్టీ అధికారం ఉంటే ఆ జెండా కింద పనిచేస్తున్న తాజా, మాజీ నేతలే అసలు పాత్రధారులు, సూత్రధారులని స్థానికులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని బడంగ పేట్ కార్పొరేషన్ ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఒకటి. ఆదాయంలో రాష్ట్రంలోనే రెండో కార్పొరేషన్ గా ప్రస్తుతం పేరుగాంచింది. కార్పొరేషన్ కు ఇరువైపులా ఆదిభట్ల, తుర్కయంజాల్, జల్ పల్లి, తుక్కు గూడ మున్సిపాలిటీ లు, మీర్ పేట్ కార్పొరేషన్ తో పాటు హస్తినాపురం, బీఎన్ రెడ్డి, వనస్థలిపురం, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ డివిజన్లు ఉన్నాయి. గతంలో సరూర్ నగర్ మండలంలో తొమ్మిది పంచాయతీలు నాదర్ గుల్, కుర్మలగూడ, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, మామిడిపల్లి, బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, సుల్తాన్ పూర్, బాలాపూర్ అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం బాలాపూర్ మండలం పరిధిలో కార్పొరేషన్ ఉంది. సమీపం లోనే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించే ఫ్యూచర్ సిటీ, జిల్లా కలెక్టర్ కార్యాలయం, టాటా ఎయిర్ స్పేస్, టీసీఎస్ లాంటి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కంపెనీలు, పలు విద్యాసంస్థలు, వృత్తి విద్యాకేంద్రాలు, ప్రముఖ కార్పొరేట్ దవాఖానాలు, అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో దూసుకుపోతుంది. 2013 లో అన్ని పంచాయతీలను కలిపి ప్రభుత్వం బడంగ్పేట్ నగర పంచాయతీని ఏర్పాటు చేసింది. అప్పటినుంచి ప్రాంత అభివృద్ధికి బీజం పడిందనే చెప్పవచ్చు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అనంతరం నగరపంచాయతీ మొదలుకొని మున్సిపాలిటీ, కార్పొరేషన్ గా రూపాంతరం చెందింది. బడంగ్పేట్ కార్పొరేషన్ లో 32 డివిజన్లు ఉండగా 300కు పైగా కాలనీల లో దాదాపుగా 2 లక్షల పైగా జనాభా ఉంది. దీంతో ఈ ప్రాంతమంతా నలువైపులుగా శరవేగంగా అభివృద్ధిలో దూసుకుపోవడం తో ఇక్కడ రియల్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరజిల్లుతుంది. కార్పొరేషన్ లో గజం స్థలం ప్రాంతం బట్టి రూ.50వేల నుంచి రూ.లక్షకు పైగానే ధర పలుకుతుండటంతో అక్రమార్కుల కన్ను కార్పొరేషన్ లోని ప్రభుత్వ స్థలాల పై పడింది. తాజా మాజీలు, అధికార పలుకుబడి ఉన్న వాళ్లంతా తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి యథేచ్ఛగా పార్కు స్థలాలను చెరబట్టి రియల్ వ్యాపారాలకు తెరలేపుతున్నారు. పదేళ్ల నుంచి కార్పొరేషన్ 70వేల గజాలకు పైగా పార్క్ స్థలాలు అన్యాకాంతమయ్యాయి అంటే అతిశ యోక్తి కాదు. వాటి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.300కోట్లకు పైగా ఉండటం గమనార్హం. ఇందులో విచిత్రం ఏమిటంటే కంచె చేను మేస్తే అనే చందంగా అధికారులు అక్రమార్కులకు ఉతమిస్తూ వారి అక్రమాలకు వంత పాడటం విశేషం. ప్రభుత్వ అనుమతితో వెంచర్లు విల్లాలు, గ్రేటర్ కమ్యూనిటీ హాల్లో నిర్మిస్తే నిర్మాణదారులు నిబంధన ప్రకారం ప్రజాప్రయోజనాల కింద 10శాతం భూమిని పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పేరిటా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది.


జై జేఏసీ

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో...

జై జై జేఏసీ

సెప్టెంబర్ 1న

పాత పెన్షన్ సాధన పోరాట సభ

వేదిక : ఆర్.టీ.సి. కళాభవన్, వి.ఎస్.టి. దగ్గర, హైదరాబాద్.

తేదీ: 1-9-2025, సమయం: మ॥ 3 గం॥ల నుండి

తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్స్, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి-హైదరాబాద్




## రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి బారీగా విరాళాలు

**-విరాళాలు అందజేసిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు ఘన సత్కారం...**







**వెలుతురు, చారకొండ ఆగస్టు 31 :**
జేపల్లి గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి పలువురు నుంచి భారీ విరాళాలు అందజేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దేవాలయ అభివృద్ధికి స్టీలు, సిమెంట్ అందజేస్తానని చెప్పారు. మాడ్గుల మండలం సుద్దపల్లి మాజీ సర్పంచ్ నరసింహ రూ.1,11,016, జేపల్లి మాజీ వార్డు సభ్యులు వెలిజాల వెంకటేష్ రూ.50,116, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాగూర్ బాలసింగ్ రూ.25వేలు, జేపల్లి గ్రామానికి చెం దిన మల్లెపాకుల వెంకటయ్య (టైల ర్) రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. విరాళాలు అందజేసిన వారికి దేవలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాల య కమిటీ సభ్యులు పోలీస్ వెంక టయ్య, లైన్ మెన్ వెంకటయ్య, కిరాణం షాపు వెంకటయ్య, లైన్ మె న్ శ్రీనివాసులు, ఆర్టీసీ సైదులు, అరవింద, యాదగిరి, రఘునందన్, శేఖ ర్, రమేష్, యం. మల్లేష్, పరశురాం, మధు, ప్రశాంత్, నరేందర్, రాకేష్, గ్రామ స్తులు, యువకులు తదితరులు ఉన్నా రు.

## గౌడ సంఘంలో వినాయకుడికి పూజా కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 31**
కోమ్మాయిగూడెం గ్రామంలో గౌడ సంఘంలో పూజా కార్యక్రమం నిర్వహించిన కల్లూరు మల్లేష్, రేణుక, దంపతులు కుమారుడు అభిరామ్ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గణేష్ మాల ధరించిన స్వాములు జల్లెల్ల నాగరాజు, వీరమల్ల గణేష్, జల్లెల్ల శివ, భక్తులు వీరమల్ల రమేష్, ఐలాపురం రమేష్ ,నాని ఎర్ర వెంకటేష్, ఆకిటి మల్లేష్, వీరమల్ల ఆధ్యా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక మండపాల వద్ద అన్నదానం



**మునుగోడు,ఆగస్ట్ 31 (వెలుతురు):**
మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో భగవంతుని పూజిస్తూ భజన పాటలు ఆలపిస్తున్నారు. ఆదివారం పగిడి శిరీష కృష్ణమూర్తి,ప్రజ్ఞాపురం నాగమణి శివకృష్ణ, కిన్నెర సుష్మ కిషోర్, సికినమెట్ల అనిత భాస్కర్ దంపతులు సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జంపాల ముత్తయ్య,జంపాల మారయ్య,సంగీత, జంపాల శ్రీను,సిద్ధి వినాయక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా జిట్టగోని వెంకటేశం

**మునుగోడు వెలుతురు ఆగస్టు 31:**



ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం పర్యావరణ ఉద్యమసంస్థ నలగొండ జిల్లా అధ్యక్షుడిగా జిట్టగోని వెంకటేశం ను ఆదివారం ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం జీడిమెట్ల రవీందర్ రాష్ట్ర అధ్యక్షులు సలహాతోప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట నరసింహ చారి మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోనియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ సమాజ అభివృద్ధి కోసం సామాజిక సేవలను చేసే విధంగా కొనసాగాలని ఆయన సూచన చేశారు .ఈ సందర్భంగా జిట్టాగోని వెంకటేశం నియామకానికి సహకరించినవారికి ధన్యవాదాలు తెలిపారు వారి వెంట ఐతరాజు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## పీర్యా నాయక్ కుటుంబానికి చిలువేరు సమ్మయ్య గౌడ్ పరామర్శ

**- సమ్మి గౌడ్ సేవలు అభినందనీయం-భరాస గ్రామ పార్టీ అధ్యక్షులు గుగులోత్ సురేష్**

**- పేద కుటుంబాలకు పెద్ద కొడుకుగా సమ్మి గౌడ్ సేవలు మరువలేనివి: సుభద్ర**

**- అనంతరం పీర్యా నాయక్ కుటుంబానికి 1క్వింటా బియ్యం15 కిలోల మంచి నూనె దీప అందజేత**




**కేసముద్రం వెలుతురు ఆగస్టు 31:**
కేసముద్రం మున్సిపాలిటీ సబ్ స్టేషన్ తండా కి చెందిన గుగులోత్ పీర్యా నాయక్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా పీర్యా నాయక్ భార్య బిచ్చాలి, కుమారుడు రాము, కుమార్తెలు సుజాత, సునీత,సంగీతల ను పరామర్శించి పీర్యా నాయక్ పవిత్ర ఆత్మకు భగవంతుని సన్నిధిలో శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెపారు కాంగ్రెస్ మండల నాయకులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్. అనంతరం వారి కుటుంబానికి 1క్వింటా బియ్యం,15 కేజీల మంచి నూనె పీపా అందజేసి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా భరాస గ్రామ పార్టీ అధ్యక్షులు సురేష్ నాయక్ మాట్లాడుతూ కేసముద్రం మండలం లో ఏ గ్రామం లోనైనా సరే పేద కుటుంబాలు ఆపదలో ఉంటే విషయం తెలిసిన వెంటనే సమ్మయ్య గౌడ్ సహాయం అందించడం,ప్రతి కుటుంబం లో ఒక సభ్యుడిగా ఉంటూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్న సమ్మయ్య గౌడ్ మంచితనాన్ని, ఔన్నత్యాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.
అదేవిధంగా సుభద్ర మాట్లాడుతూ సమ్మి గౌడ్ ప్రతి పేద ఇంటికి కొడుకుగా ప్రతి బిడ్డకు అన్నగా, ఏది ఆశించకుండా తాను చేస్తున్న సేవలు మరువలేని అని అన్నారు.. ఈ పరామర్శలో సమ్మి గౌడ్ వెంట గోపాల వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ గుగులోత్ హనుమ,వాంకుడోత్ రమేష్,వాంకుడోత్ భీమా నాయక్, వాంకుడోత్ రాజా, పార్వతి,గుగులోత్ రవీందర్,నరేష్,శంకర్, తండా వాసులు, తదితరులు పాల్గొన్నారు..

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 31**
బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో రామన్నపేట మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ నిన్న బీహార్ లో జరిగినటువంటి రాహుల్ గాంధీ యాత్రలో ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీ మీద అలాగే వారి అమ్మగారి మీద రాహుల్ గాంధీ చేసినటువంటి వాక్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పడం జరిగింది. ఈ దేశ ప్రధాని మీద ప్రతిపక్ష నాయకుడు అనాలోచితంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు ఈ దేశ ప్రధానిని కించపరిచే వ్యాఖ్యలు చేయడం అంటే ఈ దేశాన్ని అవమానించినట్టే ఈ దేశ ప్రజానీకాన్ని, అవమానించినట్టే భారతదేశాన్ని ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా మారుస్తూ భారతదేశాన్ని కీర్తి ప్రతిష్టలని ప్రపంచ నలుమూలల వ్యాపించ చేస్తున్నటువంటి మన ప్రధాని ని ఈ విధంగా అవమానించడం సిగ్గుచేటు చర్యగా భావిస్తున్నాం రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ డిమాండ్ చేస్తుంది. అని చెప్పడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య బిజెపి సీనియర్ నాయకులు దోగుపర్తి సుభాష్, దావులూరి వెంకటేశం, బీజేవైఎం జిల్లా నాయకులు అక్కినపల్లి సైదులు, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, సైదులు, మండల ఉపాధ్యక్షులు కంభంపాటి శివరంజన్, బట్టే రమేష్, మండల కార్యదర్శి రేపాక లింగస్వామి, బిజెపి నాయకులు పండ్ల రమేష్, పెండెం శీను, చిన్న పాక స్వామి, బాత్క సైదులు, వీరమల్ల గణేష్, వీరమల్ల వీరేష్, వీరమల్ల నరసింహ, సుధీర్, సుర్వి శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 3న కరీంనగర్ కు విచ్చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పర్యటనను విజవంతం చేయండి

**- పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళన ప్రోగ్రాంను సక్సెస్ చేయాలి**

**- స్థానిక సంస్థల ఎన్నికల కు సిద్ధం కండి**

**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 31:**
బిజెపి రాష్ట్ర అధ్యక్షుని హోదాలో మొదటిసారిగా సెప్టెంబర్ 3వ తేదీన కరీంనగర్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న రామచందర్ రావు కు ఘన స్వాగతం పలకాలని , అనంతరం పట్టణంలోని కొండ సత్యలక్ష్మి గార్డెన్స్ లో జరిగే పోలింగ్ బూత్ అధ్యక్షులసమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు



గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగా డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు కరీంనగర్ జిల్లా పర్యటన సందర్భంగా తలపెట్టిన ప్రోగ్రాంలన్నీ సక్సెస్ చేయడానికి బిజెపి శ్రేణులు తగిన కృషి చేయాలన్నారు. ఆయా ప్రోగ్రాం ల నిర్వహణ కోసం నియమింపబడ్డ ఇన్చార్జులు తమ తమ బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. బిజెపి పోలింగ్ బూత్ శ్రేణులు బూత్ సమ్మేళన సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ముఖ్యంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండి , బిజెపి శక్తి చాటి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రధానంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీల ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, కోమల ఆంజనేయులు, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్ రెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, ఎండి ముజీబ్, దురిశెట్టి సంపత్ , దూబాల శ్రీనివాస్, దండు కొమురయ్య, పుప్పాల రఘు, గుజ్జ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ లతో పాటు మండల, జోన్ అధ్యక్షులు, ప్రోగ్రాం ఇన్చార్జులు , మోర్చా బాధ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీ మన్ కి బాత్ వీక్షించిన బిజెపి నేతలు.

కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పార్టీ నేతలతో కలిసి ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్ కీ బాత్ లో ఆపరేషన్ పోలో విషయాన్ని ప్రధాని మోడీ గుర్తు చేశారని తెలిపారు.నిజాం అరాచక పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అతి తక్కువ కాలంలోనే ఆపరేషన్ పోలోను నిర్వహించి, భారతదేశంలో విలీనం చేశారని, 1947లో దేశానికి స్వాతంత్రం వచ్చినా.. హైదరాబాద్ మాత్రం ఇంకా నిజం చెరలోనే ఉండిపోయిన సందర్భాన్ని ప్రధాని గుర్తు చేశారన్నారు. అమాయక ప్రజలపై రజాకార్లు అత్యాచారాలు హత్యలకు తెగబడ్డారని,వీటిని చూసి సహించలేకపోయిన అప్పటి ఉప ప్రధాని సర్దార్ పటేల్.. ఆపరేషన్ పోలో పేరిట హైదరాబాద్ పై ప్రత్యేక సైనిక చర్యను చేపట్టి భాగ్యనగరాన్ని భారతదేశంలో కలిపేశారనే విషయాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్ లో వివరించారని తెలిపారు. అందుకేసెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి , ఆపరేషన్ పోలోలో భాగమైన వీరులను స్మరించుకోవాలని ప్రధాని మోడీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారని ఆయన తెలిపారు.

## గణేష్ మండపంలో చదరంగం పోటీల కు విశేష స్పందన.




**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 31:**
కరీంనగర్ లోని పాత బజార్ గోల్డెన్ యూత్ సౌజన్యంతో జీనియస్ చెస్ అకాడమీ నిర్వహణలో జరిగిన గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపంలో జరిగిన చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ ప్రదేశాల నుంచి 150 మందికి పైగా చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్ పెద్దపల్లి తాసిల్దార్ రాజ్ కుమార్ చేతుల మీదుగా బహుమతి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహేశ్వర మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున పోటీలను నిర్వహించిన గోల్డెన్ యూత్ నిర్వాహకులు అంబ్రిష్ , టింకు మరియు జీనియస్ చెస్ అకాడమీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య డైరెక్టర్ అనుప్ కుమార్ గోల్డెన్ యూత్ నిర్వాహకులు అమ్రిష్ బాల కుటీర్ ఫౌండేషన్ శ్రీనివాస్ కోడూరు ప్రకాష్ గౌడ్ ప్రమోద్ కుమార్ రాపర్తి ప్రసాద్ సృజన్ కుమార్ న్యూరో ఫిజీషియన్ చంద్ర శ్రీనివాస్ తాటిపల్లి సతీష్ బాబు చీఫ్ ఆర్బిటర్ అరుణ్ రేవిక్ నితిన్ ప్రభుచంద్ర స్వాతి తదితరులు పాల్గొన్నారు.




# ప్రధాని మోదీ మన్ కీ బాత్ వీక్షించిన కోలగని శ్రీనివాస్, కటకం లోకేష్...



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 31:**
ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ , బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్ ఆరేపల్లి లో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి వీక్షించారు. ప్రోగ్రాం అనంతరం స్థానిక నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 3 న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు కరీంనగర్ జిల్లా పర్యటన విజయవంతం చేయాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు కటకం లోకేష్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొండసత్యలక్ష్మి గార్డెన్స్ లో జరిగే బూత్ సమ్మేళన సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు , కార్యదర్శి , సోషల్ మీడియా బాధ్యులు తప్పకుండా ఈ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తిని మహేష్ గౌడ్, బత్తిని రాజశేఖర్, సత్తినేని ప్రభాకర్, భారీ జితేందర్, కొత్తపల్లి వెంకటేష్, నాన్ వినోద్, బత్తిని మురళి, కొత్తపల్లి రాము, సత్తినేని సంతోష్, బత్తిని నరేష్ , పవన్, శేఖర్,కొత్తపెల్లి మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణపయ్య శోభాయాత్రలో భక్తులు పాల్గొనండి



**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 31 :**
శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం నిర్వహించిన వినాయకుని శోభాయాత్ర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ విఘ్నేశ్వరుని కృపను పొందాలని ఆదివారం శ్రీ భక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు బాధ్యులు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడు ఐదు రోజులపాటు ప్రత్యేక పూజ కార్యక్రమం అందుకున్న వినాయకుడి శోభాయాత్ర కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు బాధ్యులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఇట్టి కార్యక్రమంలో భక్తులు,పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు.

# నరేంద్ర మోదీ మీద అనుచిత వ్యాఖ్యలు సరికావు



**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 31 :**
నారాయణఖేడ్ పట్టణంలో ప్రధాని నరేంద్రమోడీని ప్రపంచమంతా విశ్వాగురువుగా భావిస్తే కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహులు గాంధీ ప్రతి సారి కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ అన్నారు. నారాయణఖేడ్ మండల అధ్యక్షులు దశరథ్ పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి దిష్టిబొమ్మ దహనం చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్బంగా జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ మాట్లాడుతూ బీహార్ లో జరిగిన కాంగ్రెస్ సభలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఒక బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడిగా ఉండి రాహుల్ గాంధీ మోడీ తల్లిపై దుర్భాశలాడడం సిగ్గు చేటన్నారు. ప్రధాని మోడీ ని ధైర్యంగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యులు, తల్లులపై విమర్శలు చేస్తున్న దమ్ములేని నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు.ఇకనైనా విమర్శలు మానుకోకపోతే ఊరుకునేది లేదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారికి రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ రాజ్,వివిధ మండల అధ్యక్షులు యెన్నాం అనిల్ రెడ్డి,శంకర్ రావు, మాజీ మండల అధ్యక్షులు కృష్ణ, అశోక్, సాగుణాకర్, పట్నం మాణిక్, మోర్చా అధ్యక్షులు భూంరాజ్, పవన్, దశరథ్,నవీన్, జ్ఞానేశ్వర, లోకేష్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 31:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం ఆనేగుంట గ్రామంలో శ్రీ ఊరమ్మ తల్లి అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపం వద్ద అంగరంగ వైభవంగా ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేకమైన పూజలు సమర్పించుకొని అన్న ప్రసాదాన్ని భక్తులకు అందజేయడం జరిగింది. ఆదివారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆ గణేషుని యొక్క ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్, అధ్యక్షుడు తట్టు నాగేష్ , సాయి కృష్ణ , గోవర్ధన్, శివ, నరసింహ, జశ్వంత్, విష్ణు, పండరి, వీరేశం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అపరిపక్వ నాయకులు...!

**- రాజకీయాల్లో ఏం వాఖ్యలు చేయాలో చేయకూడదో తెలియని అజ్ఞాని...**

**- రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు పై పూల సంతోష్ ఫైర్....**



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 31:**
కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బిహార్ లో ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తి పై చేసిన వాఖ్యలకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ బీజేపీ పార్టీ అధ్యక్షులు పూల సంతోష్ తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం వారు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వారు పత్రిక ప్రకటనలో వెల్లడించిన పూర్తి వివరాలు...దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తి పై చేసిన అసభ్యకరమైన వాఖ్యల పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా... ఎలాంటి మచ్చ లేకుండా భారత దేశాన్ని పరిపాలిస్తున్న నాయకుడికి జన్మనిచ్చిన మాతృమూర్తి పై అసభ్యకరమైన మాటలు మాట్లాడటం రాహుల్ గాంధీ కి సిగ్గు చేటని వారు పేర్కొన్నారు. నరేంద్రమోదీ మాతృమూర్తి పై చేసిన వాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తి పై చేసిన అసభ్యకరమైన వాఖ్యల పట్ల వారు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత దేశాన్ని 13 సంవత్సరాలుగా ప్రధాన మంత్రి హోదాలో పరిపాలిస్తున్న నాయకులు నరేంద్రమోదీ అని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ తో శత్రుదేశమైన పాకిస్తాన్ కుట్రలను తిప్పికొట్టి... హెచ్చరించిన మహోన్నతమైన దేశ రక్షకుడు మోడి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లో ప్రధాన మంత్రులు పనిచేసిన వారు ఎన్నో కుంభకోణాలు చేసి దేశ ప్రతిష్టను దెబ్బ తీశారని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంను ఆదర్శంగా తీస్కుంటుంన్నాయని పేర్కొన్నారు. దేశానికి అవారులు తెచ్చి... దేశ ప్రతిష్ఠను పెంచుతా ఉంటే... మోడి మాతృమూర్తి పై అసభ్యకర మాటలు మాట్లాడం చాలా దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు, నాయకులకు అధికారదాహం తప్ప దేశం పై ఎలాంటి ప్రేమ లేదన్నారు. అనేక సార్లు దేశ రక్షణను శత్రుదేశాలకు పనంగా పెట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. అధికారం దక్కలేదన్న అసూయతో రాహుల్ గాంధీ అహం పూరిత మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. ఎక్కడ అవినీతి మచ్చ లేకుండా దేశాన్ని పరిపాలిస్తున్న మోడి పై రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలు చాలా దుర్మార్గమని,

**ఆ వాఖ్యలను వెంటనే రాహుల్ గాంధీ ఉపసంహరించుకోవాలన్నారు.**

దేశ ధర్మం కోసం నిజాయితీగా పనిచేస్తూ... గొప్పదేశంగా తీర్చిదిద్దాలని పనిచేసే నాయకులు నరేంద్రమోదీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడ ఆలోచన చేయాలని అన్నారు. రాజకీయాల్లో మాట్లాడే మాటలు కేవలం రాజకీయం వరకే పరిమితం కావాలే కానీ, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పట్ల నీచమైన వాఖ్యలు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రాహుల్ గాంధీ చేసిన వాఖ్యల పట్ల కాంగ్రెస్ పార్టీ స్టాండ్ ఏమిటో అర్థం చేసుకోవాలని దేశ ప్రజలతో కోరారు.

# పొలం బాట పట్టిన ఉద్యాన కళాశాల విద్యార్థులు



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 31:**
శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు తమ రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్పిరియన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పరిధిలోని బాబానగర్ గ్రామంలో సాగు చేస్తున్నటువంటి అల్లం పసుపు బొప్పాయి ఆరటి జనుము జీలుగా మొదలగు పంటలను పరిశీలించి సాగు విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... జహీరాబాద్ ప్రాంతంలో ఎన్నో రకాల పంటలను పరిశీలించామని మాకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ తమతో ఉండి అన్ని విషయాలు తెలియజేశారన్నారు. ఈ మూడు నెలల్లో ఇంకా కొన్ని విషయాలు నేర్చుకుంటా మని, జహీరాబాద్ ప్రాంతంలో రాష్ట్రంలో ఎక్కడ లేని వివిధ రకాల ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, ఇక్కడికి రావడం మాకు చాలా సంతోషంగా ఉందని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, విద్యార్థులు భార్గవి, మాయావతి, అక్షిత, అనిత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం... ఇద్దరు మృతి మరో ఐదుగురికి తీవ్ర గాయాలు



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 31:**
ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన సంగారెడ్డి జిల్లా లో చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా జహిరాబాద్ పట్టణానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు న్యాల్కల్ మండలం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమానికి వెళుతుండగా కారు లారీ, ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఆల్టో కార్ లో వెళుతుండగా జహీరాబాద్ పట్టణ సమీపంలోని బీదర్ రైల్వే గేట్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో మహీంద్రా కాలనీ కి చెందిన వెంకట్ (35) ఘటన స్థలంలోనే మృతి చెందగా తీవ్ర గాయలైన సాయి కుమార్ ( 20) ఆసుపత్రకి తరలించే క్రమంలో మృతి చెందాడు. గాయపడిన వారు వరలక్ష్మి అలియాస్ భవాని (వెంకటేశం భార్య), నాగేశ్వరరావు (బావ), పిల్లలు రిషికేశ్, హరిచందన, జాన్వీ వీరు అందరూ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన సమాచారం అందుకున్న వెంటనే పట్టణ సీఐ శివలింగం, పట్టణ ఎస్ఐ నవీన్ కుమార్, రూరల్ ఎస్ఐ కాశీనాథ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. కారులో ఇరుక్కుని మృత్యువుతో పోరాడుతున్న సాయికుమార్ ను కాపాడేందుకు తీవ్రంగా శ్రమించారు. అంబులెన్సు లో తరలిస్తుండగా అతను మరణించాడు కారులో ఇరుక్కున్న క్షతగాత్రులను తాళ్లు, ఇనుప రాడ్ల సహాయంతో బయటికి తీశారు. అనంతరం మృతదేహాలను పట్టణంలోని ఏరియా ఆసుపత్రి మార్చురికి తరలించారు.



# వినాయక నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు సహకరించాలి

**- ఎమ్మెల్యే మణిక్ రావు ని కోరిన పట్టణ ప్రముఖులు**

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 31:**
గత కొన్ని సంవత్సరాల నుండి జహీరాబాద్ పట్టణంలో వినాయకులను ప్రతిష్టిస్తున్నటువంటి పలు వినాయక మండప నిర్వాహకులు ఆదివారం నాడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మణిక్ రావు ని కలవడం జరిగింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తాము వినాయక విగ్రహాలను ప్రతిష్టించినట్లు ఘనంగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వారు ఎమ్మెల్యే కి తెలిపారు. ప్రతి సంవత్సరం కూడా పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలను నిర్వాహకులు వారి వీలునుబట్టి 5 ,7 ,9, 11 రోజులు పూజలు చేసి అనంతరం నిమజ్జనం చేస్తారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదే విధంగా నిర్వాహకులు నిమజ్జనం చేస్తున్నారని, పట్టణంలోని ప్రతిష్టించిన అన్ని వినాయకుల నిమజ్జనం పూర్తి అయ్యేవరకు అన్ని ప్రభుత్వ శాఖల సహాయ,



సహకారాలు తమకి అందేలా ఎమ్మెల్యే కృషి చేయాలని వారికి పలువురు పట్టణ పుర ప్రముఖులు, వినాయక మండప నిర్వహకులు మెమరండం ఇవ్వడం జరిగింది. శాసనసభ్యులు సానుకూలంగా స్పందిస్తూ అన్ని వినాయక మండప నిర్వాహకులకు అన్ని శాఖల తరపున సహకారాలు అందించేలా, నిమజ్జనం శాంతియుతంగా జరిగేలా, తన సహకారం అందజేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో డి.సి.ఎం.ఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సార్వజని కమిటీ అధ్యక్షులు సంగప్ప ముదిరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, పలువురు వినాయక మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్ మున్సిపాలిటీలో వివిధ కాలనీల్లో వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**అమీన్‌పూర్ వెలుతురు ఆగస్టు 31:**
గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి భగవాన్ కాలనీ, జయలక్ష్మీ నగర్ (ఫేజ్-1,2), ఏషియన్ కాలనీ, లక్ష్మీసాయి మెడోస్, సృజన లక్ష్మీ కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, బసవేశ్వర కాలనీ, రాజా హోమ్స్, భ్రమరాంబిక కాలనీ, ఐక్రిసాట్ కాలనీ, బీరంగూడ, రూపశ్రీ కౌంటీ, సెంటన్ గ్రీన్ హోమ్స్, ఎన్ఆర్ఐ శ్రీనివాస్ కాలనీ, వందనపురి కాలనీ, మల్లారెడ్డి



కాలనీ, నల్లూరి హైట్స్, మల్లికార్జున నగర్, రాఘవేంద్ర కాలనీ, ఓడిఎఫ్ (ఫేజ్-1,2) కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మండపంలో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “వినాయక చవితి ఉత్సవాలు సామాజిక ఐక్యతకు, సాంస్కృతిక సౌభ్రాతృత్వానికి ప్రతీకని, భక్తులందరికీ అన్నదానం ద్వారా శ్రీ వినాయకుడి కృపలభిస్తుందని” పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడిచినప్పుడే సోదర భావం పెంపొందుతుంది

**- మనం చేసే ప్రతి కార్యం అందరికి మేలు చేసే విధంగా ఉండాలి**

**- మజీద్-ఏ-యాసిన్ నిర్మాణ పనుల కార్యక్రమంలో పాల్గొన అల్ హజ్ తహేర్ అలీ షా నూరి**

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 31:**
ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడిచినప్పుడే ప్రజల మధ్య సోదరభవం పెంపొందుతుందని, మనం చేసే ప్రతి కార్యం అందరికి మెలు చేసేవిధంగా ఉండాలని ప్రముఖ ముస్లిం మత ఆధ్యాత్మిక గురువు అల్హజ్ తహేర్ అలీ షా నూరి అన్నారు.







ఆదివారం నాడు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామంలో మహేబూబ్ సుభాని దర్గా ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న మజీద్-ఏ-యాసిన్ నిర్మాణ పనులకు అల్హజ్ తహేర్ అలీ, మొహమ్మద్ హష్మీ, మొహమ్మద్ జాఫర్, మొహమ్మద్ జహీర్, సదార్ ఇసాక్ లు భూమిత్రవ్వి పనులను ప్రారంభించారు. అనంతరం అక్కడే గ్రామస్తుల యోగక్షేమాల కోసం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం చేసే పనులు సమాజానికి ఉపయోగ పడే విధంగా ఉండాలి తప్ప ఇతరులకు నొప్పించే విదంగా కాదని, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా మన జీవన విధానం, మన జీవితం ఉండాలని, అల్లా సూచించిన మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరికి మేలు చేయాలని, నమాజ్ చేసే వ్యక్తులు ఎలాంటి అభద్రతా భావాలకు గురికరని, విధిగా ప్రతి ఒక్కరు నమాజ్ చేయాలని కోరారు. కార్యక్రమం మొహమ్మద్ హష్మీ, మొహమ్మద్ జహీరోద్దీన్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధి తహేర్ అలీ షా నూరి, మజీద్ నిర్మిస్తున్న మొహమ్మద్ జాఫర్ గారికి శాలువకప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సదర్ ఇసాక్ మియా, మొహమ్మద్ రావుఫ్, మాజీ సర్పంచ్ మొహమ్మద్ జహీరొద్దీన్, మొహమ్మద్ అజిమోద్దీన్, సదర్ శహబుద్దిన్, మొహమ్మద్ శహబుద్దిన్, మొహమ్మద్ మహేబూబ్ అలీ, మొహమ్మద్ చష్మోద్దీన్ దర్గా కమిటీ అధ్యక్షుడు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.